
సాక్షి నిర్మల్

శుక్రవారం, 19, ఏప్రిల్, 2024

బుట్టాపూర్ చాలా హాట్

• రికార్డుస్థాయిలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



దస్తురాబాద్: జిల్లాలో భానుగడు భగ భగ మండుతున్నాడు. నిప్పుల వాన కురిపిస్తున్నాడు. దీంతో ఉదయం 9 గంటల నుంచే వేడితో జనం అల్లాడుతున్నారు. నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం దస్తురాబాద్ మండలం బుట్టాపూర్‌లో 44.9 డిగ్రీల రికార్డుస్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉదయం 11 గంటల నుంచే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

గరిష్టం/కనిష్టం 42.8 / 29.5

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే వేడి అధికంగా ఉంటుంది. రాత్రి కూడా ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్య లక్ష్యాలను సాధించాలి

• డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: వైద్యారోగ్య శాఖ పరిధిలో నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. సమీకృత జిల్లా అధికారుల సముదాయంలో వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. గర్భిణుల వివరాలు 12 వారాల్లో నమోదు చేయాలని సూచించారు. సమయానుసారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో క్షయ పరీక్షలు పెంచి వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించి చికిత్స అందించాలని వివరించారు. కుష్ఠు వ్యాధి బాధితులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు గ్రామపంచాయతీల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రాజేందర్, డాక్టర్ ఇద్రిస్‌గౌరి, కార్యక్రమా నిర్వాణ అధికారులు డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ రాజారమేశ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

22 వరకు పాలీసెట్ దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ రూరల్: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పాలీసెట్–2024 దరఖాస్తు గడువు ఈనెల 22 వరకు ఉందని నిర్మల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. మే 24న రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాసినవారు, గతంలో ఉత్తీర్ణులైన వారు ఈనెల 22వ తేదీలోపు polycet.sbtet.telangana.gov.inవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిన్నింగ్ మిల్లులో ఫైర్ విన్యాసాలు



విన్యాసాలు ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నిర్మల్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లులో ఫైర్ సిబ్బంది గురువారం విన్యాసాలు ప్రదర్శించారు. అంతకుముందు జిల్లా ఫైర్ కార్యాలయంలో ఫైర్‌సేఫ్టీపై అవగాహన కల్పించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి జయత్‌రామ్ మాట్లాడుతూ... ప్రజలు ప్రమాదాలబారిన పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన డీఆర్డీవో



ఉపాధి కూలీలతో డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్డీవో విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. అటవీ ప్రాంతంలో చేపట్టిన నీటిగుంతల నిర్మాణ పనులను పరిశీలించారు. తర్వాత పాత మద్దిపడగ గ్రామంలో మంచినీటి బావిని ప్రారంభించారు. పని ప్రదేశంలో టెంట్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఇందులో ఏపీవో జయదేవ్, టీఏ కాంతరావు, ఎఫ్ఏ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని లింబా(కె), లింబా(బి) గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను గురువారం పరిశీలించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సకాలంలో పన్నులు వసూలు చేసి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. డీపీవో వెంట ఎంపీడీవో అబ్దుల్ రహీం, పంచాయతీ కార్యదర్శులు సుమన్, గంగాప్రసాద్ ఉన్నారు.

చక్కదిద్దుతారా?




నామినేషన్ వేస్తున్న ఆధార్ పార్టీ అభ్యర్థి శ్యాంలాల్, స్వతంత్ర అభ్యర్థి రాథోడ్ సుభాష్

- నామినేషన్‌కు అభ్యర్థులు సిద్ధం
- 22న కాంగ్రెస్ అభ్యర్థి సుగుణ..
- 24న బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్..
- ఇదేరోజు బీజేపీ రెబెల్‌గా సోయం?
- ప్రధాన పార్టీల్లో ఆగని అలకలు
- ముఖ్యనేతల రాకతోనైనా వీడేనా?



కేసీఆర్ చేతులమీదుగా బీఫాం అందుకుంటున్న బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

సాక్షి, ఆదిలాబాద్: ప్రధాన పార్టీల ఎంపీ అభ్యర్థులు ఖరారై రోజులు గడిచాయి. కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ ఆశించి దక్కని నేతలు అలక బూనారు. కొందరు పార్టీ కూడా మారారు. నామినేషన్ ప్రక్రియ మొదలైంది. భంగపడ్డ నేతలు పార్టీకి వ్యతిరేకంగా అడుగు వేస్తారా? కలిసి నడుస్తారా? అనేది కొద్దిరోజుల్లోనే తేలనుంది. ఇక టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు రెడీ అవుతున్నారు.

'హస్తం' నేతలు అలక వీడేదెప్పుడో!

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో దాదాపు అన్ని నియోజకవర్గాల్లో హస్తం నాయకత్వం కనిపిస్తోంది. తాజాగా మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలాచారి, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. కాగా, టిక్కెట్ ఆశించిన భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్ ఇంకా ఎక్కడా ప్రచారంలో పాల్గొనడంలేదు. ఈనెల 22న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ వేయనున్నారు. ఇదేరోజు సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆదిలాబాద్ పర్యటనకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో బహిరంగసభకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్య నేతలతో సీఎం సమావేశం కానుండగా, అప్పటికైనా నేతలు అలక వీడుతారో.. లేదో వేచి చూడాలి.

కమలంలో 'తిరుగుబాటు' తప్పదా?

బీజేపీ గోడం నగేశ్‌కు టికెట్ ఇచ్చిన తర్వాత పార్టీలో అసమ్మతి చోటుచేసుకుంది. ఆశావహుల్లో అసంతృప్తి నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కాంగ్రెస్‌లో, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సైలెంట్‌గా ఉన్నారు. కాగా, ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ ఈనెల 24న నామినేషన్ వేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి ఆరోజు ఆదిలాబాద్‌కు రానున్నారు. పార్టీ టికెట్ ఆశించిన సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకు పార్టీలో నిరాశ ఎదురు కాగా బీజేపీ రెబెల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 24న ఆయన కూడా నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ బీ–ఫాం అందుకున్న సక్కు

బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆత్రం సక్కు పేరు ఖరారై చాలా రోజులైంది. ఓ దశలో అభ్యర్థిని మార్చుతారనే ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లో కొంత గందరగోళం కనిపించింది. రెండ్రోజుల క్రితం మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొనగా అభ్యర్థి మార్పు లేదని స్పష్టమైంది. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆత్రం సక్కు బీ–ఫాం అందుకున్నారు. ఈ నెల 23న లేదా 24న ఆయన నామినేషన్ వేయనున్నట్లు సమాచారం.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

• తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. ఉదయం 11గంటలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం మొదలైంది. తొలిరోజు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం జామిడి గ్రామానికి చెందిన రాథోడ్ సుభాష్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఆధార్) పార్టీ తరపున ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామానికి చెందిన మాలోత్ శ్యామ్‌లాల్‌నాయక్ నామినేషన్ వేశారు. వీరు సాదాసీదాగా అనుచరులతో వచ్చి కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషాకు నామినేషన్ పత్రాలు అందజేశారు.

పకడ్బందీ బందోబస్తు

నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా పోలీసులు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వంద మీటర్ల పరిధి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉండగా కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డుమార్గాన్ని మూసివేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. నామినేషన్లు వేసేందుకు వచ్చిన అభ్యర్థుల వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి ఐదుగురినే లోనికి అనుమతించారు. గడవు ముగిసేవరకూ ముగ్గురు సీఐలు అక్కడే విధులు నిర్వహించారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి బందోబస్తును పరిశీలించి పలు సూచనలు చేశారు. మీడియా సెంటర్‌ను వద్ద వంద మీటర్ల పరిధిలో ఏర్పాటు చేశారు.

25 వరకు నామినేషన్ల స్వీకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైనందున గురువారం నుంచి నామినేషన్లు వేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి గురువారం మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికకు నేటి నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపా రు. ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. మే 13 న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటాయని చెప్పా రు. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని (కలెక్టర్) ఛాంబర్‌లో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. సెలవు దినాలు మినహాయించి, మిగతా పనిదినాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అవలంబించాల్సిన విధానాల గురించి కలెక్టర్ వివరించారు.

జిల్లాలో 7.36 లక్షల ఓటర్లు..

నిర్మల్ జిల్లాలో 7,36,642 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో పురుషులు 3,54,925 మంది, మహిళలు 3,81,667 మంది, ఇతరులు 50 ఉన్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకున్న వారి దరఖాస్తులను ఈనెల 25 వరకు పరిశీలించి అర్హుల పేర్లు జాబితాలో చేరుస్తామని వివరించారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 667 ప్రాంతాల్లో మొత్తం 925 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటువేసే అవకాశం ఉందని తెలిపారు. మే 8వ తేదీలోపు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తామన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన కల్పించడానికి ఓటింగ్ శాతం పెంచడానికి మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారానికి, ప్రకటనలకు అనుమతులు పొందాలన్నారు. సువిధ పోర్టల్‌లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సభలు సమావేశాలకు, ఇతరత్రా అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు..

భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసుశాఖ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇప్పటికే సీఆర్పీఎఫ్ బలగాలు రూట్ మార్చ్‌లు ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తున్నాయన్నారు. మరో రెండు కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.1,90,09,610 నగదు సీజ్ చేశామన్నారు. దీనికి సంబంధించి 72 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే 298 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని 127 కేసులు నమోదు చేశామన్నారు. 289 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. సమావేశంలో డీపీఆర్వో విష్ణువర్ధన్, డీఈవో రవీందర్ రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, ఈడీఎం నదీమ్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై గురువారం సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, వీల్‌చైర్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది రవాణాకు రూట్‌ల వారీగా బస్సులను ఏర్పాటు చేయాలని ట్రాన్స్ పోర్ట్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని, శిక్షణకు హాజరుకాని సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఎన్నికల వ్యయాలను నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. వంద శాతం ఓటింగ్ నమోదు దిశగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత స్వీప్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫ్లెక్సీలు, సెల్ఫీపాయింట్, కళాజాత, 2కే రన్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 1950 కాల్ సెంటర్, సి విజిల్ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారులు భుజంగరావు, గోవింద్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, విజయలక్ష్మి, సందీప్, విష్ణువర్ధన్, ఈడీఎం నదీమ్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ వయోజన విద్య

- సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం
- ఎన్ఐఎల్‌పీ పేరుతో నూతన కార్యక్రమం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహణ
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత నుంచి అమలు?

నిర్మల్‌చైన్‌గేట్: అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదేళ్ల ప్రణాళికతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. జిల్లా పరిషత్, పంచాయతీ, స్వయం సహాయక, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ సమన్వయంతో నిరక్షరాస్యుల జీవితాల్లో వెలుగు నింపేందుకు 'న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం' (ఎన్ఐఎల్‌పీ)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతేడాది నుంచే ఈ కార్యక్రమం అమలు కావాల్సి ఉండగా.. ప్రభుత్వం దృష్టి సారించలేదు. దీంతో ప్రస్తుతం ఈ ప్రోగ్రాం వందశాతం సక్సెస్ అయ్యేలా విద్యాశాఖ అధికారులు దృష్టిసారిస్తున్నారు. ఈకార్యక్రమం ద్వారా బడికి దూరంగా ఉంటున్న బాలబాలికలతో పాటు, పెద్దలు, మహిళల్లో సైతం అక్షర జ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టనున్న ఈ కార్యక్రమంలో 2022 నుంచి 2027 వరకు ఐదేళ్లలో ఏడాదికి కోటి మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా రూపకల్పన చేశారు. ఇందులో 2011 జనాభా లెక్కల ప్రకారం 60 శాతం కంటే తక్కువ మహిళా అక్షరాస్యత ఉన్న జిల్లాలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో మొదటి విడత 20,866 మంది వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు.

పర్యవేక్షణ.. నిర్వహణ

ఎన్ఐఎల్‌పీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో కన్వీనర్‌గా, వయోజన విద్యా అధికారి(కో కన్వీనర్), సభ్యులుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, వెల్ఫేర్ ఆఫీసర్లు, జెడ్పీ సీఈవో, ఐసీడీఎస్, డీపీవో, డీఆర్డీవో, లీడ్ బ్యాంకు మేనేజర్, న్యాయ సేవా సమితి పర్యవేక్షణలో ఈ ప్రోగ్రాం నిర్వహిస్తారు. అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతోపాటు ఉన్నత చదువులకు సహకారం అందించనున్నారు. కల్చరల్, ఆర్టిస్టు, ఒకేషనల్ కోర్సు, వృత్తి విద్య, ఓపెన్‌లో పది, ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ప్రతిభ చూపేలా ప్రోత్సహిస్తారు. కార్యక్రమం లక్ష్యం చేరుకునేలా సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు, అంగన్వాడీ, యూత్, సీనియర్ సిటిజన్, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, సర్కారు ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటారు. ప్రభుత్వ పాఠశాలలో సమయానుకూలంగా ఉదయం లేదా సాయంత్రం డిజిటలైజేషన్ ద్వారా వయోజన విద్యాబోధన చేసేలా టైం టేబుల్ ప్రకటిస్తారు. వయోజనులకు నోట్ బుక్స్‌తోపాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. సమగ్ర అభ్యాస అనుభవాన్ని అందించడానికి అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, డిజిటల్ నైపుణ్యాలు వంటి విద్యలోని వివిధ అంశాలను ఏకీకృతం చేసేలా ప్లాన్ చేసుకుంటారు. డిజిటల్ ప్లాట్‌ఫారం, వనరుల వినియోగంతోసహా అభ్యాసాన్ని సైతం ఉపయోగించుకుంటారు. ప్రాథమిక అక్షరాస్యతతోపాటు వారి జీవనోపాధి, వ్యక్తిగత అభివృద్ధికి సంబంధించిన ఆచరణాత్మక నైపుణ్యాలు కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దుతారు.

త్వరలో సర్వే..

జిల్లాలో 1,46,457మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు అంచనా. ఎన్ఐఎల్‌పీ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రత్యేక సర్వే ద్వారా వీరిని గుర్తించాల్సి ఉంటుంది. మొదటగా అత్యధిక నిరక్షరాస్యులు ఉన్న పది గ్రామాలను ఎంచుకుని వందశాతం టార్గెట్ చేరుకునేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. సర్వేలో నిరక్షరాస్యుల గుర్తింపుతోపాటు గైడ్‌లైన్స్ పాటించేలా పర్యవేక్షణ బృందానికి సలహాలు, సూచనలు ఇస్తారు.

వలంటీర్లతో బోధన...

న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం ద్వారా 15 నుంచి 50 ఏళ్లలోపు నిరక్షరాస్యులను అక్షరాస్యులు చేయనున్నారు. స్వయంసహాయ సంఘాల సభ్యులకు చదువు నేర్పనున్నారు. గతంలో సాక్షర భారత్ పథకం కింద సమన్వయకర్తలు చదువు చెప్పేవారు. కొత్తగా చేపట్టే ఈ కార్యక్రమంలో వలంటీర్లను నియమిస్తారు. వీరికి శిక్షణ, సామగ్రిని అందించనున్నారు. 2027 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

2011 లెక్కల ప్రకారం...

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా అక్షరాస్యత 57.7 శాతం ఉండగా అందులో పురుషులు 69.03 శాతం, స్త్రీలు 47.14 గా ఉంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 1,46,457 మంది నిరక్షరాస్యులు ఉండగా, ఇందులో మహిళలు 99,637, పురుషులు 46,820 మంది ఉన్నట్లు అధికారుల అంచనా. మొదటి విడతలో 20,866 (పురుషులు 8,346, మహిళలు 12,520)మందిని అధికారులు సర్వేచేసి అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్.చౌహాన్
- అధికారులు, సిబ్బందికి ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్‌పై శిక్షణ



మాట్లాడుతున్న ఎస్ఈ జేఆర్.చౌహాన్

ఖానాపూర్: విద్యుత్ శాఖలో పనిచేసే ప్రతీ ఉద్యోగి, సిబ్బంది నిరంతరం భద్రత గురించి ఆలోచించడంతోపాటు సురక్షితంగా పనిచేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్.చౌహాన్ సూచించారు. ఉత్తర విద్యుత్ సంస్థ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని సత్తనపల్లి రైతువేదికలో ఖానాపూర్ సబ్‌డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్‌పై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ డ్యూటీలో ఉన్నప్పుడు సేఫ్టీ షూస్‌తోపాటు సేఫ్టీ హెల్మెట్, సేఫ్టీ గ్లౌజ్ ధరించాలని తెలిపారు. ఫీడర్‌కు ఎల్‌సీ ఇచ్చేటప్పుడు ఎర్త్ డిస్చార్జ్ రాడ్‌ను వాడాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలని తెలిపారు. అంతకుముందు పలు విషయాలను ప్రొజెక్టర్ సాయంతో వీడియో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ సీజీఎం కేఎస్.గుట్ట, నిర్మల్ డీఈ నాగరాజు, టెక్నికల్ డీఈ బి.శ్రీనివాస్‌రావు, జిల్లా గణాంక అధికారి సుదర్శన్, ఏడీఈ కేశెట్టి శ్రీనివాస్, ఏఈలు తిరుపతి, సుమన్, బాలయ్య, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్, రాజు, తిరుపతి, సబ్ ఇంజనీర్లు వెంకటేశ్, స్వాతి, శ్యాంసుందర్, నాగరాజు, లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ఆదాయమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్

భైంసాటౌన్/నిర్మల్‌టౌన్: ఆర్టీసీకి అదనపు ఆదాయం తీసుకురావడమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలని డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్, నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. భైంసా, నిర్మల్ డిపోల్లో 'లక్షే లక్ష్యం' కార్యక్రమాన్ని గురువారం వేర్వేరుగా ప్రారంభించారు. అంతకుముందు జెండా ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2024 ఉగాది నుంచి 2025 ఉగాది వరకు ప్రతీరోజు డిపోకు రూ.లక్ష అదనపు ఆదాయం తెచ్చేలా కృషి చేయడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రతీ ఉద్యోగి ట్రిప్పులో రెండు నుంచి ఐదుగురు ప్రయాణికులు అదనంగా ప్రయాణించేలా చూడాలని సూచించారు. తద్వారా లక్ష్యం చేరుకోవచ్చన్నారు. అనంతరం ఉద్యోగులతో 'మా లక్ష్యం లక్ష' అని ప్రతిజ్ఞ చేశారు. తర్వాత స్వీట్లు పంచారు. కార్యక్రమాల్లో ఏఎంఎఫ్ఎల్ చందు, నిర్మల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ కుమార్, డిపోల ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

• కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ఆలూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సారంగపూర్: ప్రతీరోజు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రధాన కూడళ్లలో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆదేశించారు. మండలంలోని చించోలి(బి), ఆలూరు, ధని గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులు, సీసీరోడ్ల నిర్మాణాలు, మురికి కాలువలు, పల్లె ప్రకృతివనం, నర్సరీ, పాఠశాలలను పరిశీలించారు. గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంట, కూడళ్లలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీవో తిరుపతిరెడ్డిని ఆదేశించారు. వ్యాపారులు, దుకాణాల నిర్వాహకులు బయట చెత్త వేయకుండా చూడాలన్నారు. ఎవరైనా చెత్తను బయట వేస్తే చర్య తీసుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేయించి గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన..

అనంతరం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. 40 కేజీల బస్తాలో 40.580 గ్రాముల ధాన్యం మాత్రమే తూకం వేయాలని సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో కేంద్రాల ఆవరణలో టెంట్లు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆలూరు పీఏసీఎస్ సీఈవో మల్లేశ్‌కు సూచించారు. కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఫోన్ నంబర్ తీసుకురావాలని తెలిపారు. నిబంధనల మేరకు ధాన్యం తేవాలని పేర్కొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచాలి..

ధని గ్రామంలోని పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా కేటాయించిన నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులు పూర్తి చేయించాలని హెచ్ఎంను ఆదేశించారు. విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించి పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి గోవింద్, డీఈవో రవీందర్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీదేవి, అధికారులు ఉన్నారు.

బీజేపీకే ఎమ్మార్పీఎస్ మద్దతు

• జిల్లా కోఆర్డినేటర్ రవి

సోన్: లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ బీజేపీకి మద్దతు ఇస్తుందని జిల్లా కోఆర్డినేటర్ శనిగారపు రవి తెలిపారు. మండలంలోని జాఫ్రపూర్‌లో కాంగ్రెస్ గో బ్యాక్ నినాదంతో గురువారం ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌కు మాదిగలు ఓటు వేయాలని కోరారు. మాదిగలను చిన్న చూపు చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళ నాయకురాలు మరకుంట సునీత, భాగ్యలక్ష్మి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తొండకూరి సాయన్న, నాయకులు నాటకారి రాజ్యలక్ష్మి, సాయన్న, గంగన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన కుస్తీ పోటీలు



పోటీలో తలపడుతున్న మల్లయోధులు

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో గురువారం నిర్వహించిన కుస్తీ పోటీలు నిలిచిపోయాయి. ఏటా శ్రీరామ నవమి సందర్భంగా కుస్తీపోటీలు నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు మల్లయోధులను పిలిపించి శ్రీరామ నవమి మరుసటి రోజు పోటీలు నిర్వహిస్తారు. గురువారం కూడా పోటీలకు ఏర్పాట్లు చేశారు. పోటీలు జరుగుతున్న సమయంలో కొంత మంది అక్కడి వచ్చి పెద్దలకు దూషించారు. గొడవ జరిగే వాతావరణం కనిపించడంతో కుస్తీపోటీలను నిలిపివేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు వారిని చూసేందుకు వచ్చిన ఉత్సాహికులు నిరాశపడ్డారు.

క్లుప్తంగా

నేడు అల్లంపల్లికి చినజీయర్ రాక


సిద్ధమైన యాగశాల

కడెం: నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపల్లి గ్రామానికి త్రిదండి చినజీయర్‌స్వామి శుక్రవారం రానున్నారు. అల్లంపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయం, మంగల్‌సింగ్‌తండాలో అభయాంజనేయస్వామి ఆలయం, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్(జెట్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలను ప్రారంభించనున్నట్లు జెట్ నిర్వాహకులు వివరించారు.

సుమన మృతిపై స్పందించని దేద్ర


దేద్ర గ్రామ ముఖచిత్రం

బజార్‌హత్నూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లాలో మావోయిస్టులు, బీఎస్పీ జవాన్లకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 29 మంది మావోయిస్టుల్లో బజార్‌హత్నూర్ మండలం దేద్ర గ్రామానికి చెందిన దాసర్వార్ సుమన అలియాస్ రజిత ఉన్నట్లు మీడియాలో చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. కానీ, సుమన సొంత గ్రామం దేద్రలో మాత్రం ఎన్‌కౌంటర్ గురించి పెద్దగా చర్చ జరగలేదు. గురువారం గ్రామంలో ఒక ఆదివాసీ కుటుంబంలో వివాహ వేడుక జరిగినా అక్కడ ఎన్‌కౌంటర్‌పై ఎలాంటి చర్చ పెట్టలేదు. సుమన కుటుంబ సభ్యులు కూడా ఏమీ తెలియనట్టే కనపడ్డారు. సుమన తల్లి అంజనాబాయిని సంప్రదించి మావోయిస్టుల పోస్టర్‌లో సుమనగా భావిస్తున్న ఫొటోను చూపించగా.. తన కూతురిలా లేదని తెలిపింది. గుర్తు పట్టేందుకు అక్కడి దవాఖానకు తీసుకువెళ్తే పోతావా? అని అడిగితే వెళ్తానని చెప్పింది. ఎన్‌కౌంటర్ జరిగి నాలుగు రోజులైనా మృతదేహాన్ని చూపించడానికి నా దగ్గరకు ఎవరూ రాలేదని పేర్కొంది. ఎవరైనా వస్తే వెళ్తానని అంజనాబాయి తెలిపింది.

ఆర్జీయూకేటీ విద్యార్థి మృతికి సంతాపం


మౌనంపాటిస్తున్న అధ్యాపకులు


భైంసా: ఆర్జీయూకేటీ బాసరలో పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బుచ్చుక అరవింద్ మృతికి వర్సిటీ పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం సంతాప కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు. అరవింద్ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఇది దురదృష్టకరమైన సంఘటన అన్నారు. విద్యార్థి కుటుంబానికి వర్సిటీ తరఫున ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఆధ్యాత్మిక వారధిపై ఆశలు

- బాసర – మహోర్ హైవే నిర్మాణానికి డిమాండ్
- ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు, పార్టీల హామీ కోసం పట్టు
- కారిడార్ నిర్మిస్తే టూరిజం అభివృద్ధికి అవకాశం



భైంసా: దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల సందడి మొదలైంది. అన్ని పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. ఇక అభ్యర్థులు తమ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి హామీలు ఇస్తూ ప్రచారం చేస్తున్నారు. అయితే పొరుగున్న మహారాష్ట్రతో ముధోల్ నియోజకవర్గ ప్రజలకు ఎప్పటి నుంచో సత్సంబంధాలు ఉన్నాయి. బంధుత్వాలు, ఇచ్చి పుచ్చుకునే వారు ఉన్నారు. దీంతో నిత్యం వేలాది మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తారు. అయితే వీటి మధ్య రహదారి సక్రమంగా లేదు. కేంద్రం రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ముధోల్ మీదుగా మహారాష్ట్రకు ఆధ్యాత్మిక కారిడార్ నిర్మించాలని ఇటు ముధోల్ వాసులు, అటు మహారాష్ట్ర వాసులు కోరుతున్నారు. నిర్మల్ జిల్లా బాసర, నాందేడ్ జిల్లాలోని మహోర్‌ను కలుపుతూ హైవే నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత ఎంపీ సోయంబాపురావుకు ఈ ప్రాంతవాసులు వినతిపత్రం కూడా ఇచ్చారు. మహారాష్ట్రలోని హింగోలి ఎంపీ పరిధిలో వచ్చే మహోర్ ప్రాంతవాసులు సైతం కోరారు. మహారాష్ట్రలోని మాజీ ముఖ్యమంత్రి, బోకర్ ఎమ్మెల్యే అశోక్‌రావు చౌహాన్‌తో కలిసి ఈ ప్రాంతవాసులు హైవేపై చర్చించారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో అటు మహారాష్ట్రలోనూ ఇటు మన ప్రాంతంలోనూ మరోమారు ఈ హైవేపై చర్చ జరుగుతోంది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు హైవే నిర్మాణంపై హామీ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఆధ్యాత్మిక కారిడార్‌తో టూరిజం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటున్నారు.



బాసర – మహోర్ దూరం తెలిపే గూగుల్‌మ్యాప్

రెండు క్షేత్రాలను కలుపుతూ...

చదువుల తల్లి సరస్వతీదేవి బాసరలో కొలువుదీరింది... పక్కనే మహారాష్ట్రలో మహోర్‌లో రేణుక ఎల్లమ్మ కొలువై ఉంది. మహోర్‌లో ప్రసిద్ధ దత్తాత్రేయ మందిరం ఉంది. ఏటా ఈరెండు పుణ్యక్షేత్రాలకు లక్షల మంది భక్తులు వెళ్తుంటారు. రెండు క్షేత్రాల మధ్య మహారాష్ట్రలోని సాసర్‌కుండ్‌లో జలపాతం ఉంది. ఈ క్షేత్రాలకు వచ్చే యాత్రికులు జలపాతం వద్ద ఆగి అందాలు వీక్షిస్తారు. ఇక బాసరలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న యాత్రికులు సరైన రోడ్డు మార్గం లేక మహోర్ ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. దసరా నవరాత్రుల్లో మహారాష్ట్రలోని మహోర్ రేణుక ఎల్లమ్మను, బాసర సరస్వతీ అమ్మవారిని లక్షల మంది ప్రత్యేకంగా దర్శించుకుంటారు. రెండు పుణ్యక్షేత్రాల మధ్య ఆధ్యాత్మిక కారిడార్ అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇరుకుగా 26 కిలోమీటర్లు..

ఇక ఈ రెండు ప్రాంతాల మధ్య ఇప్పటికే వేర్వేరు జాతీయ రహదారులు ఉన్నాయి. మరో 26 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్ నుంచి నిర్మల్ జిల్లాలోని కుభీర్ వరకు 26 కిలోమీటర్ల రోడ్డు ఇరుకుగా ఉంది. ఈ రోడ్డును విస్తరించి ఫోర్‌లేన్‌గా విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈమేరకు భైంసాకు చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి పరిస్థితిని వివరించారు.

అభివృద్ధికి మార్గం...

రెండు ఆధ్యాత్మిక కేంద్రాల మధ్య వారధి పూర్తయితే అభివృద్ధికి మార్గం వేసినట్టవుతుంది. ఇప్పటికే ఈ మార్గాల మధ్య పలు పట్టణాలు ఉన్నాయి. భైంసా, కుభీర్, హిమాయత్‌నగర్, కిన్వట్, సాసర్‌కుండ్, ఇస్లాపూర్ పట్టణాలను కలుపుతూ ఈ మార్గం వెళ్లనుంది. ఈ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణంతో పర్యటకుల సంఖ్య మరింత పెరుగనుంది. మహారాష్ట్రతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మహానుబావు ఆచారం పాటించే మరాఠీలు దత్తాత్రేయ స్వామినే కొలుస్తారు. దత్తాత్రేయుడు జన్మించిన క్షేత్రంగా చెప్పుకునే మహోర్‌కు లక్షలాదిగా భక్తులు వెళ్తుంటారు.

రెండు రహదారులను కలిపితే...

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్, మెదక్, నర్సాపూర్ మీదుగా 161 జాతీయ రహదారి నిర్మాణం ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారి భైంసా వరకు నిర్మించనున్నారు. ఇక భైంసా నుంచి కుభీర్ వరకు నాలుగేళ్ల క్రితమే డబుల్ రోడ్డు నిర్మించారు. మహారాష్ట్రలో అకోట్ – బీదర్ 161 హైవే రోడ్డు మహారాష్ట్రలోని మహోర్ – కిన్వట్ మీదుగా వెళ్తుంది. దాదాపుగా మధ్యలో ఉన్న 26 కిలోమీటర్ల రోడ్డు పూర్తిచేస్తే పూర్తి ఇబ్బందులు దూరవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో హైవే నిర్మాణంపై ఎంపీగా బరిలో ఉన్న నేతలు హామీ ఇవ్వాలని కోరుతున్నారు.

చి'వరి'కి ఎండుతోంది!


కొత్త మద్దిపడగలో నీరందక ఎండిన పొలం

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామంలో నీరందక వరి పంటలు ఎండిపోతున్నాయి. గ్రామానికి చెందిన రైతులు బ్రహ్మపురి శంకర్, రాజన్నకు చెందిన నాలుగు ఎకరాల్లోని వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలోనే సాగునీరు నిలిచిపోయింది. ఇటీవల మళ్లీ సదర్మాట్ కాలువకు నీటిని విడుదల చేసినా చివరి ఆయకట్టు అయిన కొత్త మద్దిపడగ, ధర్మాజీపేట్, వకీల్‌నగర్, పెద్దూర్ తండా గ్రామాల వరకు చేరలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



గంజాయి నిర్మూలనే లక్ష్యం

నార్నూర్: నార్నూర్, గాదిగూడ, ఇంద్రవెల్లి, సిరికొండ, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లో గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక ఆపరేషన్ కొనసాగుతోందని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ పేర్కొన్నారు. గురువారం గాదిగూడ మండలంలో ఒకరి నుంచి రూ.12,500 విలువచేసే 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. సీఐ రహీం పాషా పర్యవేక్షణలో గాదిగూడ, నార్నూర్ ఎస్సైలు మహేశ్‌కుమార్, రవికిరణ్ రెండు బృందాలుగా ఏర్పడి గాదిగూడ, నార్నూర్ మండలాల్లో గంజాయి నిర్మూలనకు కృషి చేస్తున్నారని చెప్పారు. జిల్లాలోనే అత్యధికంగా నార్నూర్, గాదిగూడ మండలాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గురువారం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్న క్రమంలో గాదిగూడ మండలంలో కొంత గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రవాణా చేస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నార్నూర్ సీఐ రహీం పాషా, ఎస్సై మహేశ్‌కుమార్ తదితరులున్నారు.



గంజాయి, నిందితులతో డీఎస్పీ, సీఐ, ఎస్సై

హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో పార్డి(కె) విద్యార్థి మృతి

- ఒక్కగానొక్క కొడుకు మృతితో కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు


అజయ్(ఫైల్)

కుభీర్: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పార్డి(కె) గ్రామానికి చెందిన విద్యార్థి మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బందెల గజ్జరాం–సునీత దంపతులకు కుమారుడు బందెల అజయ్(18), కుమార్తె ఉన్నారు. గతేడాది ఇంటర్ పూర్తి కావడంతో ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాలలో చేర్పించారు. ఇటీవల ఇంటికి వచ్చి అజయ్ గత ఆదివారం కాలేజీకి వెళ్లాడు. హైదరాబాద్‌లో బస్సు దిగి ఆటోలో హాస్టల్‌కు వెళ్తుండగా రాత్రి 9 గంటల సమయంలో మరో ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో అజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. అమీర్‌పేట్‌లోని వెల్ఫేర్ అసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే హైదరాబాద్ వెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం అజయ్ మరణించాడు. ఒక్కగానొక్క కొడుకు మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.


అజయ్ ఇంటివద్ద రోదిస్తున్న బంధువులు

స్వగ్రామానికి చేరిన మృతదేహం

ఖానాపూర్: బ్రహెయిన్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్ మృతదేహం గురువారం ఖానాపూర్‌కు చేరింది. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు షబ్బీర్‌పాషా మృతదేహంపై సంఘం జెండాను కప్పి నివాళులర్పించారు. తమ సంఘం ప్రత్యేక చొరవతో మృతదేహం నివాసానికి చేరినట్లు పేర్కొన్నారు. గల్ఫ్ కార్మిక సంఘాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి బాధిత కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. నవీన్ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మృతదేహాన్ని ఖానాపూర్‌కు పంపించేందుకు కృషిచేసిన బహ్రెయిన్‌లోని రాజేశ్వర్, పెద్ద భూమన్న, డాక్టర్ భీమన్నకు కృతజ్ఞతలు తెలిపారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు

- రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్
- భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం
- మృతుడు నిర్మల్ జిల్లా వాసి

జక్రాన్‌పల్లి: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని బైక్ ఢీకొన్న ఘటనలో భర్త మృతిచెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహవీర్ తండాకు చెందిన జాదవ్ సుధాకర్ (30), అతడి భార్య శిరీష డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి తండాలో శుభాకార్యంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జక్రాన్‌పల్లి జాతీయరహదారిపై నిలిచి ఉంచిన లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయమై సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందగా, శిరీష తీవ్రగాయాలపాలైంది. ఆమెను చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు. ఘటనాస్థలాన్ని ఎస్సై తిరుపతి, ఏఎస్సై సుశీల్ పరిశీలించారు. ఘటనకు బాధ్యుడైన లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ప్రమాద స్థలిలో సుధాకర్ మృతదేహం

ఆ ఊరి దూప తీరింది

- డీఆర్డీవో చొరవతో పాతమద్దిపడగకు తాగునీరు
- పాత బావికి మరమ్మతు
- ఊరంతటికీ మంచి నీటి సరఫరా
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


మరమ్మతులు చేయించిన డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాక, 30 ఏళ్లుగా ఊరికి తాగునీరు అందించిన బావి పాడుబడిపోవడంతో దాహంతో అల్లాడుతున్న పాతమద్దిపడగ దూప తీర్చారు డీఆర్డీవో విజయలక్ష్మి. ఊరి ప్రత్యేక అధికారిగా డీఆర్డీవో విజయలక్ష్మి తీసుకున్న ప్రత్యేక చొరవతో పాడుబడ్డ బావి కొత్త రూపు సంతరించుకుంది. ఐదేళ్ల తర్వాత తిరిగి ఆ బావి నుంచి ఊరంతటికీ తాగునీరు అందుతోంది.

30 ఏళ్ల బావి మరమ్మతు..

కడెం మండలం పాతమద్దిపడగ గ్రామానికి 30 ఏళ్లుగా మంచినీటిని అందించిన బావి నిర్వహణ లేక ఐదేళ్ల క్రితం పాడుబడిపోయింది. చెత్తచెదారంతో చేరడంతో నీరంతా కలుషితమైంది. గ్రామానికి మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నా నల్లా నీళ్లు సక్రమంగా రాకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో తాగునీటి సమస్య తీవ్రమైంది. కానీ, బావిలో నీరున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు దానిని వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో ఐదేళ్లుగా వేసవిలో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలే గ్రామ ప్రత్యేక అధికారిగా నియమితులైన డీఆర్డీవో విజయలక్ష్మి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. పాత బావిని సందర్శించి దాని గురించి ఆరా తీశారు. నీటి సమస్య పరిష్కారానికి మరమ్మతులు చేపట్టారు. పాడుబడ్డ బావికి కొత్త రూపు తీసుకొచ్చారు. గురువారం బావి నీటిని గ్రామానికి సరాఫరా చేశారు. డీఆర్డీవో చొరవతో ఏళ్లుగా తాగునీటి కోసం పడుతున్న తమ కష్టాలు తీరాయని గ్రామస్తులు తెలిపారు.


మరమ్మతు చేయించిన తర్వాత బావి

రుణపడి ఉంటాం



మాది ఎస్సీ కాలనీ. ఏటా వేసవిలో మా కాలనీకి మంచినీళ్లు రావు. బాయిల కాడికి పోయి తెచ్చుకోవాలి. నీటి సమస్యను అధికారులకు, నాయకులకు చెప్పినా పట్టించుకోలేదు. డీఆర్డీవో మేడం వచ్చాక మా సమస్య పరిష్కారమైంది. మేడంకు రుణపడి ఉంటాం.

– రత్నాల సరిత, మద్దిపడగ

సంతోషంగా ఉంది



మాకు మిషన్ భగీరథ నీళ్లు రావు. కాలనీ మొత్తానికి ఒకటే చేతిపంపు ఉంది. అది కూడ పనిచేయడం లేదు. నీటి కోసం దూరం వెళ్లాల్సిందే. ఇప్పుడు మేడం బావిని మంచిగా చేయించడంతో మా నీటి కష్టాలు తొలగిపోయాయి. మా కాలనీకి నీళ్లు రావడం సంతోషంగా ఉంది.

– కారం పుష్పలత, మద్దిపడగ

నీటి ఇబ్బందులు చూశా



పాత మద్దిపడగ గ్రామ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించి, గ్రామంలో పర్యటించిన సమయంలో నీటి సమస్యను గుర్తించాను. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు చూశాను. ఏళ్లుగా పాడుబడ్డ బావికి ఉపాధిహామీ నిధులతో మరమ్మతులు చేయించాం. ఇప్పుడు సమస్య తీరింది.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యంతో పోలీసులు

కుభీర్: మండలంలోని పార్డి(బి) గ్రామంలో బెల్ట్‌షాపులో నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మినట్లు అందిన సమాచారం మేరకు కొడిపాక సాయినాథ్ షాపులో తనిఖీ చేయగా 1,494 లీటర్ల మద్యం లభించినట్లు తెలిపారు. దీని విలువ రూ.5,976 ఉంటుందని పేర్కొన్నారు. నిర్వాకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

తానూరు: మండలంలోని బోరిగాం గ్రామంలో బెల్ట్‌షాపుపై గురువారం రాత్రి పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. గ్రామానికి చెందిన బాలేరావ్ నాందేవ్ అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడిచేశారు. రూ.9,438 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

చదువుకున్న బడిలో సరస్వతీ విగ్రహం


ప్రతిష్ఠించిన సరస్వతీదేవి విగ్రహంవద్ద పూర్వవిద్యార్థినులు

- 1992–93 బ్యాచ్ విద్యార్థినుల సహకారంతో ఏర్పాటు

నిర్మల్‌ఖిల్లా/ నిర్మల్ రూరల్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ బాలికల గురుకుల విద్యాలయంలో 1992–93 బ్యాచ్‌కు చెందిన విద్యార్థినిల సహకారంతో గురువారం సరస్వతీ విగ్రహం ఏర్పాటు చేశారు. ఉద్యోగం, ఉపాధి రీత్యా ప్రస్తుతం ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు తమ జ్ఞాపకంగా సరస్వతీదేవి విగ్రహం ప్రతిష్ఠించాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు గురువారం ఆచరణలో పెట్టారు. పూర్వ విద్యార్థులంతా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్నారు. డీఈవో డాక్టర్ రవీందర్‌రెడ్డి విగ్రహ దాతలైన పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగశంకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధి భగత్‌సింగ్‌నగర్ కాలనీకి చెందిన అజీమ్ సికందర్ (45) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. అజీమ్ సికందర్‌కు 2006లో మహెమూద షాహెదాతో వివాహమైంది. వీరికి 16 ఏళ్ల కుమార్తె, 15 ఏళ్ల కుమారుడున్నారు. సికందర్ ఓ ప్రైవేట్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన సికందర్ తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భార్యతో గొడవపడి మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.